

ఎస్కేయూ ముఖద్వారం




జేఎన్‌టీయూ ముఖద్వారం



వర్సిటీల్లో ఇంకా వైసీపీ పాలనే!

పాలక మండళ్లను మార్చని ప్రభుత్వం



ఉన్నత విద్యను అందించే విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉంటుంది. నిర్వహణ కోసం పాలక మండలిని (ఈసీ) ఏర్పాటు చేస్తారు. అభివృద్ధి పనులు, కోర్సులలో ప్రవేశాలు, భవన నిర్మాణాలు, సిబ్బంది నియామకం, ప్రమోషన్లు.. ఇలా అన్నింటిపై ఈసీ నిర్ణయం తీసుకుంటుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈసీలో సభ్యులుగా చేరేందుకు చాలామంది పోటీ పడతారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు తమకు నచ్చిన వారిని సభ్యులుగా చేర్పించి, ఆర్థిక ప్రయోజనాలు పొందారని వర్సిటీల వర్గాలు మండిపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనా పాత ఈసీలే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మారినందున.. ఈసీని కూడా మార్చాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

- అనంతపురం సెంట్రల్

- గత ప్రభుత్వంలో అడ్డగోలు నిర్ణయాలు
- ఎస్కేయూ, జేఎన్‌టీయూలో అక్రమాలు
- ఈసీలను మార్చాలని వర్సిటీ వర్గాల డిమాండ్

ఈసీ నిర్ణయమే శిరోధార్యం

పాలక మండలి సమావేశంలో తీసుకునే నిర్ణయాలే వర్సిటీలకు శిరోధార్యం. గత మూడేళ్లలో ఎస్కేయూలో అనేక అక్రమాలను పాలకమండలి సమావేశాల్లో అజెండాలుగా చేర్చారు. ఇదేంటని ప్రశ్నించిన వారికి పాలకమండలి తీసుకున్న నిర్ణయమే ఫైనల్, కోర్టులకెళ్లినా పాలక మండలి నిర్ణయాలకు ఎదురు చెప్పదని అప్పటి వీసీ రామకృష్ణారెడ్డి సమాధానం చెప్పారని వర్సిటీ వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో అనేకమంది ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు ఎదుర్కొన్నారని, విద్యార్థులకు అన్యాయం జరిగిందని మండిపడుతున్నాయి. తామేమి తక్కువ కాదన్నట్లు జేఎన్‌టీయూ పాలక మండలి కూడా ఇష్టానుసారంగా వ్యవహరించింది. వర్సిటీ నిధులను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసిందని ఉద్యోగ వర్గాలు మండి పడుతున్నాయి.





అడ్డమైన నిర్ణయాలు...

ప్రభుత్వం మాదే, పాలక మండలిలోనూ మేమేనంటూ వైసీపీ నాయకులు అడ్డదిడ్డమైన నిర్ణయాలు తీసుకున్నారు. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వకుండా అనర్హులను అందలమెక్కించారు. అయిన వారికి దోచిపెట్టేందుకు కాంట్రాక్టులన్నీ కట్టబెట్టారు. ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించారు. ఇలా ఐదేళ్లలో ఇష్టానుసారంగా వ్యవహరించారు.

- ధనుంజయ నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

కోటాల వారీగా నియామకం

పాలక మండలి సభ్యులుగా ప్రభుత్వ శాఖల అధికారులు, సమాజంలో వివిధ రంగాల ప్రముఖులను నియమిస్తారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఆర్థికశాఖ డిప్యూటీ ఫైనాన్షియల్ అడ్వైజర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ ప్రభుత్వ కోటాలో సభ్యులుగా ఉంటారు. వర్సిటీ వీసీ ఛైర్మన్‌గా, రిజిస్ట్రార్ సెక్రెటరీగా, రెక్టార్ అంతర్గత సభ్యుడిగా ఉంటారు. వీరితోపాటు కోటాల వారీగా.. వర్సిటీ సొంత కళాశాలల నుంచి ప్రిన్సిపాల్, సీనియర్, జూనియర్ అధ్యాపకులు, అనుబంధ ప్రైవేట్ కళాశాలల నుంచి ప్రిన్సిపాల్, లెక్చరర్, కళాశాల యాజమాని ఒకరు చొప్పున సభ్యులుగా నియమిస్తారు. పారిశ్రామికవేత్తలు, చార్టెడ్ అకౌంటెంట్, సోషల్ యాక్టివిస్ట్, అడ్వకేట్, డాక్టర్, ఇంటలెక్చువల్ కోటా నుంచి ఒక్కొక్కరికి చోటు కల్పిస్తారు. జేఎన్‌టీయూ ఈసీలో ఛైర్మెన్‌గా వీసీ, సెక్రటరీగా రిజిస్ట్రార్‌తోపాటు 12 మంది సభ్యులు ఉన్నారు. ఎస్కేయూ ఈసీలో ఛైర్మన్‌గా వీసీ, సెక్రటరీగా రిజిస్ట్రార్‌తో పాటు 13 మంది సభ్యులు ఉన్నారు.

లెక్కలేనన్ని అక్రమాలు...



సొంతంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన పాలక మండలిని వైసీపీ నాయకులు చేతుల్లోకి తీసుకున్నారు. వారికి అవసరమైన పనులను మాత్రమే అజెండాల్లో చేర్చి చక్కబెట్టుకున్నారు. నిర్మాణాలు, టెండర్లు, సరఫరా.. ఇలా ప్రతిపనిని వైసీపీ నాయకులే చేజిక్కించుకుని అనేక అక్రమాలకు పాల్పడ్డారు.

- రమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

కొత్త ఈసీలను ఏర్పాటు చేయాలి



జేఎన్‌టీయూ, ఎస్కేయూ పాలక మండళ్లను కొత్తగా ఏర్పాటు చేయాలి. అభివృద్ధికి అడుగులు వేసేలా సమావేశాలను నిర్వహించాలి. కూటమి ప్రభుత్వం అవినీతికి తావులేకుండా పాదర్శకంగా పని చేయాలి.

- వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు

సమాచార లీకులు

వర్సిటీల్లో అంతర్గంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తదితర అంశాలను ఈసీ సమావేశంలో చర్చించాల్సి ఉంటుంది. దీని కోసం గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు సిఫార్సులతో జేఎన్‌టీయూ, ఎస్కేయూ ఈసీ మెంబర్లుగా కొంతమందిని నియమించుకున్నారు. వీరి ద్వారా అంతర్గత సమాచారాన్ని తీసుకుని ఆర్థిక, ఇతర ప్రయోజనాలు పొందుతూ వచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వీసీ, రిజిస్ట్రార్‌లను మార్చారు. కొత్త ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ఈసీ మెంబర్ల ద్వారా క్షణంలో వైసీపీ నాయకులకు సమాచారం చేరిపోతోంది. ఈ అంశం కొత్తగా కొలువు తీరిన వర్సిటీల యాజమాన్యాలకు తలనొప్పిగా మారిందని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. ఇంకా వైసీపీ పాలనే కొనసాగుతున్నట్లుగా ఉందని పెదవి విరుస్తున్నాయి.

అమావాస్యనా.. అడ్డంకులా..?

విధుల్లో చేరని మెజార్టీ తహసీల్దార్లు

- ఆషాఢం.. ఆదివారం అమావాస్యే కారణమా..?
- ప్రజా ప్రతినిధులు తిరస్కరిస్తున్నారని ప్రచారం
- పోస్టింగ్‌లలో మార్పులు జరిగే అవకాశం

అనంతపురం టౌన్, ఆగస్టు 3: ఎన్నికల నిబంధనల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు జిల్లాకు తిరిగొచ్చారు. వారికి స్థానాలను కేటాయిస్తూ శుక్రవారం అర్ధరాత్రి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు మొత్తం 40 మంది తహసీల్దార్లు రాగా, వారిలో ఆరుగురిని కలెక్టరేట్‌కు నియమించారు. ఇద్దరిని ఆర్డీఓ కార్యాలయాలకు కేటాయించారు. అనంతపురం అర్బన్‌కు ఈసారి ప్రత్యేక తహసీల్దారును నియమించారు. మిగిలిన 31 మందిని మండలానికి ఒకరు చొప్పున నియమించారు. వీరిలో శనివారం ఒకరిద్దరు మాత్రమే విధుల్లో చేరినట్లు తెలిసింది. ఆషాఢ మాసం కావడం, ఆదివారం అమావాస్య ఉండటంతో చాలా మంది విధుల్లో చేరలేదు. కానీ విధుల్లో చేరకపోవడానికి వేరే కారణాలు ఉన్నాయని రెవెన్యూ, రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. కొన్ని మండలాలకు కేటాయించిన తహసీల్దార్లను ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నారని తెలిసింది.

వ్యతిరేకిస్తున్న టీడీపీ శ్రేణులు

అత్యంత కీలకమైన ఓ మండలానికి మహిళా అధికారిని తహసీల్దారుగా నియమించారు. ఆమె అక్కడ పనిచేయడం చాలాకష్టమని అంటున్నారు. ఆమె నియామకాన్ని టీడీపీ నాయకులు, శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆమెను మార్చేందుకు ఆ నియోజకవర్గ ప్రజాప్రతినిధి మొగ్గు చూపుతన్నారని తెలిసింది. సీనియర్ ప్రజాప్రతినిధి నియోజవర్గానికి కేటాయించిన ఇద్దరు తహసీల్దార్లను టీడీపీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. కొత్తగా ఎమ్మెల్యే అయిన ఒకరు సైతం తహసీల్దార్ల నియామకం పట్ల సంతృప్తిగా లేరని చర్చ జరుగుతోంది. ఇలా చాలాచోట్ల తహసీల్దార్లను మార్చాలని జిల్లా ఉన్నతాధికారులను ఎమ్మెల్యేలు కోరినట్లు తెలిసింది. అధికారులు సర్దిచెప్పడానికి ప్రయత్నించినా.. ఎమ్మెల్యేలు ఒప్పుకోలేదని సమాచారం. ఈ సమస్య పెద్దది కాకుండా జిల్లా యంత్రాంగం సైతం దిద్దుబాటుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితులలో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొత్త తహసీల్దార్లలో ఎక్కువశాతం సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది. ఆ సమయంలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

మండలాలకు కేటాయించిన తహసీల్దార్లు

పేరు	మండలం
హరికుమార్	అనంతపురం అర్బన్
మునివేలు	బొమ్మనహాళ్
వాణిశ్రీ	అనంతపురం రూరల్
మోహన్‌కుమార్	కూడేరు
ఈరమ్మ	గార్లదిన్నె
లక్ష్మీనాయక్	ఆత్మకూరు
పుణ్యవతి	బుక్కరాయసముద్రం
బ్రహ్మయ్య	శింగనమల
బాలాజీరాజు	పెద్దపప్పూరు
నవాజ్‌అహ్మద్	వజ్రకరూరు
ఈశ్వరమ్మ	తాడిపత్రి
శ్రీధరమూర్తి	పామిడి
రమాదేవి	గుంతకల్లు
ప్రతాప్‌రెడ్డి	యాడికి
భూషణం	పెద్దవడుగూరు
మహబూబ్ బాషా	ఉరవకొండ
భాస్కర్	కళ్యాణదుర్గం
సునీతాబాయి	విడపనకల్లు
ఎం.బాలక్రిష్ణ	కంబదూరు
ఎస్. షర్మిల	బెళుగుప్ప
ఎస్‌పీ శ్రీనివాసులు	కుందుర్పి
ఎస్.శ్రీనివాసులు	గుమ్మఘట్ట
ఓబులేసు	గుత్తి
ఈశ్వరయ్యశెట్టి	శెట్టూరు
ఫణికుమార్	కణేకల్లు
అరుణకుమారి	నార్పల
శేషారెడ్డి	పుట్లూరు
నాగరాజు	యల్లనూరు
విజయకుమారి	రాప్తాడు
అలెగ్జాండర్	రాయదుర్గం
సుమతి	బ్రహ్మసముద్రం

కలెక్టరేట్‌కు వీరే..

మారుతి(ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్, అడ్మిన్), రజాక్‌వలి (సూపరింటెండెంట్, కో ఆర్డినేషన్ సెక్షన్), రియాజుద్దీన్ (సూపరింటెండెంట్, మెజిస్టీరియల్ సెక్షన్), నీలకంఠారెడ్డి (కోనేరు రంగారావు కమిటీ, సూపరింటెండెంట్), నారాయణస్వామి(ల్యాండ్ రీఫార్మ్స్), వసంత లత (సూపరింటెండెంట్, మెజిస్టీరియల్ సెక్షన్)

ఆర్డీఓ కార్యాలయాలకు..

- విజయలక్ష్మి, అనంతపురం ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్
- ఉషారాణి, గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

అందరికీ సరుకులు ఇవ్వండి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



సరుకుల రసీదును పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 3: కార్డు దారులందరికీ నిబంధనల మేరకు నిత్యావసర సరుకులు అందించాలని ఎండీయూ వాహనదారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. పాతూరులో రేషన్ సరుకులను అందిస్తున్న ఎండీయూ వాహనాన్ని శనివారం తనిఖీ చేశారు. లబ్ధిదారులు, సరుకుల వివరాలను తెలుసుకున్నారు. తూకాలు సక్రమంగా వేస్తున్నారా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. బియ్యంతో పాటు రాగిపిండి, ఇతర సరుకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. తూకాలలో తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇన్‌చార్జి ఆర్డీఓ వసంతబాబు, డీటీ పునీత్, సివిల్ సప్లయ్స్ డీటీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తీపి కబురు

సూక్ష్మసేద్య పరికరాలకు రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు చెప్పింది. ఈ ఏడాది జిల్లాలో 37,500 హెక్టార్లకు సూక్ష్మ సేద్య పరికరాలు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉద్యాన శాఖ డైరెక్టర్ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైతు సేవా కేంద్రాల్లో స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాల కోసం రైతులు ఆధార్ బయోమెట్రిక్ ద్వారా శనివారం నుంచే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించామని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం, వన్ బీ, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటో సమర్పించాలని సూచించారు. సబ్సిడీని ప్రభుత్వం త్వరలో ఖరారు చేసే అవకాశం ఉందని తెలిపారు.

సఖి సెంటర్ సంరక్షణలో బాలిక

అనంతపురం విద్య, ఆగస్టు 3: లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ లైంగిక దాడి కేసులో బాధిత బాలికను వన్‌స్టాప్ సఖి సెంటర్ సంరక్షణలో ఉంచారు. చిన్నారిని అధికారులు శుక్రవారం విచారించిన అనంతరం వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆసుపత్రి సమీపంలోని సఖీ సెంటర్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం బాలిక, ఆమె తల్లి సఖీ సెంటర్ సంరక్షణలో ఉన్నారు. వైద్య పరీక్షల నివేదిక ఒకటి లేదా రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది.

గుప్త నిధుల వేట

గంగాధరేశ్వర ఆలయంలో తవ్వకాలు



గుప్త నిధులు కోసం జరిగిన తవ్వకాలు

బొమ్మనహాళ్, ఆగస్టు 3: మండల పరిధిలోని ఉంతకల్లు గ్రామ శివారులో ఉన్న గంగాధరేశ్వర స్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం శుక్రవారం రాత్రి దుండగులు తవ్వకాలు జరిపారు. పురాతనమైన ఈ ఆలయంలో నంది విగ్రహాన్ని పెకిలించి.. ఆ ప్రాంతంలో రెండు అడుగులు లోతు తవ్వారు. నంది విగ్రహాన్ని ధ్వంసం చేసి బయటకు పడేశారు. ఆలయ సమీపంలోని పొలానికి శనివారం ఉదయం వెళ్లిన గ్రామ రైతు రామాంజి ఈ విషయాన్ని గమనించారు. అర్చకుడు అమరేష్‌కు సమాచారం అందించారు. గ్రామస్థులు ఆలయానికి చేరుకుని పరిశీలించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని వివరాలను సేకరించారు. కొన్నేళ్ల క్రితం ఇదే ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయి. మరోమారు తవ్వకాలు జరగడం కలకలం రేపుతోంది. దీని వెనుక స్థానికులు ఉన్నారా..? లేక ఇతర ప్రాంతాలవారు వచ్చారా..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బయో మెడికల్ వ్యర్థాలతో జాగ్రత్త

ఏపీపీసీబీఈ ఇంజనీర్ కిషోర్ కుమార్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3: బయోమెడికల్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పెద్దిరెడ్డి కిశోర్‌కుమార్ రెడ్డి నగరపాలిక అధికారులకు సూచించారు. వాటిని జాగ్రత్తగా సూచించిన సంచులలో, కేటాయించిన స్థలాలలో వేసి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఆసుపత్రులలో ఉత్పత్తయ్యే బయో మెడికల్ వేస్ట్, ఘన వ్యర్థాల నిర్వహణపై శనివారం అవగాహన కల్పించారు. ఆసుపత్రులలో వాడే పరికరాలు, మందులు ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాల గురించి ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన కల్పించాలని కిశోర్‌కుమార్ రెడ్డి సూచించారు. బయోమెడికల్ వ్యవర్థాలను మున్సిపల్ సాలిడ్ వేస్ట్‌లో కలపకూడదని అన్నారు. బయోమెడికల్ వ్యర్థాలను, ఇంటింటి నుంచి సేకరించే చెత్తను వేర్వేరుగా పడేయాలని ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి సూచించారు. ఇందుకు ఆకుపచ్చ, నలుపు రంగుల సంచులు ఉపయోగించాలని సూచించారు.

పాలస్తీనాపై దాడులను ఆపాలి: సీపీఐ



అనంతపురం విద్య, ఆగస్టు 3: పాలస్తీనాపై దాడులను ఇజ్రాయిల్ వెంటనే ఆపాలని సీపీఐ డిమాండ్ చేసింది. నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు శనివారం నిరసన ప్రదర్శన చేశారు. ఇజ్రాయిల్‌ను ప్రపంచదేశాలన్నీ బహిష్కరిస్తే పాలస్తీనా ప్రశాంతంగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. ఇజ్రాయిల్ దాడిలో పాలస్తీనాలో ప్రతి పది నిమిషాలకు ఓ పసివాడు చనిపోవడం లేదా గాయపడటం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా భూభాగంలో 62 శాతం ఇప్పటికే ధ్వంసమైందని, ఆహార కొరత ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది మంది బాధితులు ఆహారం కోసం అలమటిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర ప్రధాన కార్యదర్శి జాఫర్, నాయకులు అల్లిపీరా, రాజేష్, రామాంజినేయులు, ఖాజా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీల్లో ఆకలి కేకలు

రోగులకు అందని భోజనం

- అడ్మిషన్‌లో ఉన్నా... ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిందే
- నిరుపేద రోగులకు దాతలే దిక్కు
- వైసీపీ పాలనలో గాడి తప్పిన నిర్వహణ



శింగనమల సీహెచ్‌సీ

అనంతపురం టౌన్, ఆగస్టు 3: జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీలు) పరిస్థితి దారుణంగా ఉంది. రోగులకు టిఫెన్, పాలు, భోజనం అందించాల్సి ఉంది. కానీ జిల్లాలో ఒకటి, రెండు చోట్ల మాత్రమే వాటిని సరఫరా చేస్తున్నారు. మిగిలిన ఏ ఆస్పత్రిల్లో వాటిని సరఫరా చేయకపోవడంతో రోగులు అన్నమో రామచంద్రా అని అలమటిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సక్రమంగా నిర్వహించకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. జిల్లాలో వైద్యవిధాన పరిషత్‌శాఖ పరిధిలో 11 సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, సీడీ ఆస్పత్రి ఉన్నాయి. తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, అనంతపురం పాతూరు సీడీ ఆస్పత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, పామిడి, శింగనమల, కణేకల్లు, కొనకొండ్లలో ఈ ఆస్పత్రులున్నాయి. ఈ ఆస్పత్రులు 24 గంటల పాటు రోగులకు వైద్యసేవలు అందించాల్సి ఉంది. దీంతో ఈ ఆస్పత్రుల్లో అత్యవసర కేసులు, తీవ్ర రోగాలతో వచ్చే కేసులను అడ్మిషన్ చేసుకొని వైద్య సేవలు అందించాలి. ప్రభుత్వం అలాంటి రోగులకు ఉదయం టిఫెన్, పాలు, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతున్నా.. అనంత జిల్లాలో మాత్రం రోగులకు భోజనం అందడం లేదు. కేవలం గుంతకల్లు, రాయదుర్గం ఆస్పత్రుల్లో మాత్రమే ప్రస్తుతం రోగులకు టిఫెన్, భోజనం అందిస్తున్నట్లు సమాచారం. మిగిలిన ఆస్పత్రుల్లో ఎవరైనా దాతలు దయతలిచి.. భోజనం పెడితే ఆ నిరుపేద రోగులకు ఆ పూట గడిచినట్లె.

అడ్మిషన్ అయినా...

ఈ ఆస్పత్రుల్లో అవసరమైన వసతులున్నాయి, డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు. కానీ భోజన వసతి లేక పోవడంతో రోగులను అడ్మిషన్ చేసుకోవడానికి డాక్టర్లు, సిబ్బంది అయిష్టత చూపుతున్నారు. వచ్చినవారికి తాత్కాలిక సేవలు అందించి.. సాయంత్రానికల్లా ఇళ్లకు పంపుతున్నారు. ఒకవేళ ఆరోగ్యంగా లేకపోతే వారిని రెఫర్ పేరుతో జిల్లా కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటున్నారు. కేవలం ఓపీలు మాత్రమే చూసుకుంటూ డాక్టర్లు కాలం వెళ్లదీస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకవేళ రోగి అడ్మిట్ అయితే ఆ రోగులు ఇళ్ల నుంచో.. హోటల్ నుంచో భోజనం తెచ్చుకోవాల్సిందే. దీంతో నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇంటి నుంచే భోజనం



మాది ఇరువెందల గ్రామం. నా కూతురును డెలివరీ కోసం మూడు రోజుల క్రితం శింగనమల ఆస్పత్రికి తీసుకొచ్చాం. ఇక్కడ అన్నం పెట్టడంలేదు, మేమే ఇంటి నుంచి రోజూ తెచ్చుకుంటున్నాం. ఇక్కడ డాక్టర్లు కూడా ఎవరు భోజనం గురించి మాట్లాడడంలేదు. మా తిప్పలు మేం పడుతున్నాం.

- భాగ్యలక్ష్మి, బాలింత తల్లి, శింగనమల

హోటల్‌లో తెచ్చుకుంటున్నాం..



మాది హౌసింగ్ బోర్డు కాలనీ. మా అమ్మ జ్వరం, నొప్పులతో బాధపడుతుంటే పాతూరులోని ఆస్పత్రికి తీసుకొచ్చాం. ఇక్కడ ఓ గదిలో ఉంచి సెలైన్‌లు ఎక్కిస్తున్నారు, డాక్టర్ మంచిగా చూస్తున్నారు. అయితే అన్నం ఇక్కడ పెట్టడంలేదు. ఆ ఇల్లు దూరం కావడం... మా అమ్మ వద్ద ఇంకొకరు ఎవరు లేకపోవడంతో పక్కనే ఉన్న హోటల్‌లో తెచ్చుకొని తింటున్నాం.

- మంజునాథ, అనంతపురం

కలెక్టర్ చూస్తున్నారు..

సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో కొన్నేళ్లుగా రోగులకు డైట్ అమలు కావడం లేదు. రాష్ట్రంలో అన్ని చోట్లా అమలు చేస్తున్నా ఇక్కడ మాత్రం అమలు చేయడంలేదు. నేను కొత్తగా వచ్చినపుడు ఈ విషయం తెలుసుకొని ఆశ్చర్యపోయాను. భోజన వసతి ఉన్నప్పుడే రోగుల అడ్మిషన్ పెరుగుతాయి. ఇప్పుడు గుంతకల్లు, రాయదుర్గంలో మాత్రమే అమలు చేస్తున్నారు. మిగిలిన అన్ని ఆస్పత్రుల్లో డైట్ అమలుకు ఏజెన్సీలను చూడాలని కలెక్టరు చెప్పారు. మంచివాళ్లను చూస్తున్నాం, త్వరలో అన్నింటా రోగులకు భోజన వసతి కల్పిస్తాం. - డాక్టర్ రవికుమార్, డీసీహెచ్ఎస్

శ్రావణ శోభ

ఆంజనేయస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు

కసాపురం, మురడి, నేమకల్లులో సందడి

రేపటి నుంచి వేడుకలు ఆరంభం

గుంతకల్లు/డి.హీరేహాళ్/బొమ్మనహాళ్, ఆగస్టు 3: శ్రావణ మాసోత్సవాలకు ఆంజనేయ స్వామి ఆలయాలు సిద్ధమవుతున్నాయి. ప్రత్యేకంగా కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలకు ఈ మాసంలో భక్తులు పోటెత్తుతారు. అందుకు అనుగుణంగా ఆలయ అధికారులు, దేవదాయశాఖ ఏర్పాట్లు చేస్తున్నాయి. హనుమాన్ భక్తులు ఎంతో పవిత్రంగా భావించే శ్రావణ మాసం సోమవారం నుంచి మొదలవుతుంది. నెలరోజులపాటు అన్ని శని, మంగళవారాల్లో ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జిల్లాలో విజయ నగర రాజుల వంశీకుడు వ్యాస రాయలచే ప్రాణ ప్రతిష్ఠ పొందిన కసాపురం, మురిడి, నేమకల్లు ఆంజనేయ స్వామి మూల విరాట్టులను భక్తులు శ్రావణ మాసంలో ఒకే రోజు దర్శించుకుంటారు. ఈ శ్రావణ మాసంలో నాలుగు శని, ఐదు మంగళవారాలలో ఉత్సవాలను నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లును చేపట్టారు. శనివారాల్లో స్వామివారికి వాహనోత్సవాలను, మంగళవారాల్లో ప్రత్యేక అలంకారాలు, వెండి రథోత్సవాలను నిర్వహిస్తారు.



మురడి ఆలయంలో..

శ్రావణ మాసోత్సవాల కోసం మురడి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సిబ్బంది, ఎంపీటీసీ గంగాధర ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వీఐపీ, సర్వదర్శనాలకు, ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి బారికేడ్లు ఏర్పాటు చేయించారు. భక్తులకు అన్న ప్రసాదం కోసం ఏర్పాట్లు చేశారు.



శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది





కసాపురంలో...

ఈ నెల 10న శ్రావణ మాస మొదటి శనివారాన్ని పురస్కరించుకుని స్వామివారికి శేష వాహనోత్సవం నిర్వహిస్తారు. 17వ తేదీ రెండో శనివారం హనుమంత వాహనోత్సవం, 24వ తేదీ మూడో శనివారం గజవాహనోత్సవం, 31వ తేదీ నాలుగో శనివారం గరుడ వాహనోత్సవం నిర్వహిస్తారు. మంగళవారాలలో స్వామివరికి అలంకారాలు, సాయంత్రం వెండి రథ ప్రాకారోత్సవాలను నిర్వహిస్తారు. ఉత్సవ రోజుల్లో స్వామివారి మూల విరాట్టుకు వజ్రకవచాలంకరణ చేస్తామని ఈఓ భద్రాజీ తెలియజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు విడిది, భోజనం, తాగునీరు, వైద్య సేవలను కల్పిస్తామని తెలిపారు. సాధారణంగా మూడు, నాలుగు శనివారాలలో దేవస్థానానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. తొక్కిసలాట జరక్కుండా వలంటీర్లను ఏర్పాటు చేశారు..



నేమకల్లులో అసౌకర్యాలు

ఈ నెల 5 నుంచి ఉత్సవాలు ప్రారంభమై.. నెల రోజుల పాటు కొనసాగుతాయి. కానీ నేమకల్లు ఆలయంలో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు అన్నదాన సత్రం ప్రాంగణంలో రాత్రి బస చేస్తారు. మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేవు. మహిళలు ఆరుబయటే స్నానాలు చేసి దుస్తులు మార్చుకోవాల్సిన దుస్థితి ఉంది. ఏడాదికి రూ.50 లక్షలకుపైగా స్వామివారికి ఆదాయం వస్తుంది. అయినా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉత్సవాల నేపథ్యంలో మొబైల్ మరుగుదొడ్లు, స్నానపు గదులనైనా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు దేవదాయశాఖ అధికారులు పాలక మండలిని ఏర్పాటు చేయలేదు. ఇకనైనా పాలకమండలిని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



నేమకల్లు ఆలయం

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంతకల్లు, ఆగస్టు 3: గుత్తి రైల్వేస్టేషన్ వద్ద వంతెన గిర్డర్లను మార్చే పనుల కారణంగా రెండు రైళ్లను రద్దు చేసి మరో రెండింటిని దారిమళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డోన్-గుత్తి-డోన్ డెము (నెం. 07289/90) రైలును ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుంతకల్లు-హిందూపురం-గుంతకల్లు ప్యాసింజరు (నెం. 07693/94) రైలును ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కల్లూరు-గుత్తి-గుంతకల్లు రూటులో కాకుండా, కల్లూరు-గూళ్యపాళ్యం-గుంతకల్లు రూటుకు మళ్లించడం జరిగిందన్నారు. ఈ కారణంగా నాలుగురోజులపాటు పామిడి, తురకపల్లి, గుత్తి, పాత కొత్తచెరువు, నక్కనదొడ్డి, తిమ్మనచెర్ల స్టేషన్ల మీదుగా ఈ ప్యాసింజరు రైలు వెళ్లదని పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 3: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 2400 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.13, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 3: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17,700లు, కనిష్ఠంగా రూ.2,500లు, సరాసరి రూ.11,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం గా 748టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బిస్కెట్ గోడౌన్‌లోకి ఎలుగుబంటి

భయాందోళనలో కాలనీవాసులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 3: పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా వున్న బిస్కెట్ ఏజెన్సీ నిర్వాహకుడు కరణం రాఘవేంద్ర గోడౌన్‌లోకి శుక్రవారం రాత్రి ఎలుగుబంటి చొరబడింది. బిస్కెట్ బాక్స్ చించివేసి బిస్కెట్లను తింటున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. రెండవసారి ఎలుగుబంటి కాలనీలోకి రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నా రు. అటవీ శాఖ అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు.



బిస్కెట్ గోడౌన్‌లో ఉన్న ఎలుగుబంటి

బాధ్యతల స్వీకరణ

కళ్యాణదుర్గం, ఆగస్టు 3: కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌గా డాక్టర్ చెంద్రాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కోఆర్డినేటర్ రాధాకుమారి నంద్యాలకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో చెంద్రాయుడును నియమించారు. కదిరి వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రిన్సిపాల్ శాస్త్రవేత్తగా పనిచేస్తూ కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రానికి బదిలీ అయ్యారు. రైతులకు అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తామని పేర్కొన్నారు.



చంద్రాయుడు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 3: బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వ్యాపారనిర్వహణపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్‌ఖయ్యూమ్ శనివారం తెలిపారు. వివరాలకు 7981541994ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 3

ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు సూచించారు. శనివారం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని శాస్త్రవేత్తలు, రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ మెట్ట పంటలను పరిశీలించారు. అనంతరం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాభావపరిస్థితుల నేపథ్యంలో రైతులు సాగుచేయాల్సిన పంటలపై చర్చించారు. అదేవిధంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు కల్పించాల్సిన అవగాహనపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌శంకర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లో కంది, జొన్న, కొర్ర, సజ్జ, అలసంద, ఉలవ, ఆముదం, పెసర పంటలను వేసుకోవచ్చన్నారు. నల్లరేగడి భూముల్లో కంది, ఆముదం, పత్తి ఆగస్టు 10వ తేదీ వరకు విత్తుకోవచ్చని సూచించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు గుత్తానారాయణస్వామి, లక్ష్మణ్, భార్గవి, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం

అనంతపురం అర్బన్, ఆగస్టు 3: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలను బెంగళూరుకు చెందిన టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం బెంగళూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంత ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు తదితరులను సన్మానించారు.



సన్మాన సభకు హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు

ఉద్యాన పథకాలను వాడుకోండి

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో అమలు చేస్తున్న ఆర్కేవీవై, ఎంఐడీహెచ్ పథకాలను జిల్లాలోని ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు టీఎస్ చేతన్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఉద్యాన పంటలైన మామిడి, చీనీ, దానిమ్మ, జామ, నేరేడు, ఉసిరి, డ్రాగన్‌ఫ్రూట్, అంజూర, చింత, సీతాఫలం, విడిపూలసాగు, హైబ్రీడ్ కూరగాయల పండ్లతోటల పెంపకానికి 40% సబ్సిడీతో మొక్కలు అందజేస్తామన్నారు. తమ పొలాల్లో ఫారంపాండు నిర్మించుకునే రైతుల యూనిట్‌పై 50% రాయితీ అందిస్తారన్నారు. వ్యక్తిగత ఫారంపాండు, కమ్యూనిటీ ఫారంపాండు, ప్యాక్‌హౌస్ నిర్మాణం, ఉద్యాన యాంత్రీకరణ, మినీట్రాక్టర్, ట్రాక్టర్‌కు అనుసంధినించు పిచికారీ యంత్రం, తైవాన్ స్ప్రేయర్, రక్షిత వ్యవసాయం, పాలీహౌసులు, షేడ్ నెట్ హౌసులు, పందిరి వ్యవసాయం, ఎఫ్‌పీఓ సంఘం ఏర్పాటు చేయడం, 40% సబ్సిడీతో తేనేటీగల పెంపకం వంటి పథకాలు ఉంటాయన్నారు. వివరాలకు జిల్లా ఉద్యానశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇంకా పాతదేనా?

కొత్త మద్యం కోసం ఎదురుచూపు

జేబ్రాండ్లతో మందుబాబుల ఇబ్బంది

ఫుల్‌గా స్టాక్ నింపిన పాత ప్రభుత్వం

అది అయిపోయే వరకు ఇదే గతి!

నిట్టూరుస్తున్న మద్యం ప్రియులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 3: రాష్ట్రంలో అధికారం మారినా ఇంకా జే బ్రాండ్లేనా అంటూ మందు బాబులు నిట్టూరుస్తున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో నాణ్యమైన మద్యం లభిస్తుందని మద్యం ప్రియులు ఆశలు పెట్టుకున్నారు. అయితే నేటికీ గతంలో సరఫరా చేసిన నాసిరకం మద్యాన్నే విక్రయిస్తున్నారన్న విమర్శలు న్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి వైసీపీ పాలకులు ముందస్తుగానే తమ బినామీ, అనుకూలమైన డిస్టిలరీస్ నుంచి భారీగా మద్యం కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అధికారం మారినా ఇప్పటికీ గతంలో విక్రయించిన నాసిరకం మద్యమే సరఫరా అవుతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో భారీగా మద్యం కొనుగోలు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దాన్ని మద్యం దుకాణాలకు సరఫరా చేయాల్సి వస్తోందని తెలిసింది. ఇదే క్రమంలో మరి కొన్ని బ్రాండ్లను కల్తీ చేసి మద్యం తయారీదారులు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కొందరు మద్యం ప్రియులు ఎక్సైజ్ అధికా రులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయినట్లు సమా చారం. గత ప్రభుత్వ హయాంలో సరఫరా చేసిన నాసిరకం బ్రాండ్ల సరఫరాను ఆపేస్తే తప్ప నాసిరకం మద్యం విక్రయాలకు చెక్ పడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మచ్చుకు కొన్ని..

అనంతపురం నగరం కమలానగర్ బాషా హోటల్ సమీపంలోని ఓ మద్యం దుకాణంలో రెండు రోజుల క్రితం ఓ మద్యం ప్రియుడు ప్రముఖ మద్యం బ్రాండ్ ఆరంజ్ ఫ్లేవర్ ఫుల్ బాటిల్‌ను కొనుగోలు చేశాడు. తన స్నేహితులతో కలిసి విందు చేసుకొనేందుకు బాటిల్‌ను ఓపెన్ చేయగా మద్యాన్ని కల్తీ చేసినట్లు స్మెల్ కొట్టింది. వాసనతో ఏముందిలే అని మద్యం తాగి చూస్తే గతంలో ఆరంజ్ ఫ్లేవర్ మందుతో పోలిస్తే ఇప్పటి మందును కల్తీ చేసినట్లు తేలిందని ఆ మద్యం ప్రియుడు ఆవేదన వ్యక్తం చేశాడు. మరో మద్యం ప్రియుడు అనంతపురం శ్రీకంఠం సర్కిల్‌లోని మాల్‌లో ఒక రోజు కిందట ప్రసిద్ధి చెందిన బ్రాండ్ రెండు ఆఫ్ బాటిళ్లు కొనుగోలు చేశాడు. అదే రోజు తన స్నేహితులతో కలిసి మద్యాన్ని సేవించాడు. గతంలో దానికి దీనికి తేడా ఉన్నట్లు గుర్తించి మొత్తం మద్యాన్ని పారబోసినట్లు పేర్కొన్నాడు. జిల్లా వ్యాప్తంగా మద్యం ప్రియులందరు ఇదే చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. ఈ కల్తీ మద్యం తాగిన కొందరు ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నట్లు తెలిపారు.



అనంతపురం నగరంలో మద్యం కోసం క్యూ

అప్పటిదాకా ఇంతేనా..?

టీడీపీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కొత్త మద్యం పాలసీని అమలు చేయడంతోపాటు మద్యం టెండర్లు నిర్వహించేదాకా తమకు నాసిరకం మద్యం బాధలు తప్పవా అంటూ మద్యం ప్రియులు ప్రశ్ని స్తున్నారు. ప్రభుత్వం మారినా జే బ్రాండ్లు ఇంకా విక్రయిస్తుండటంతో కల్తీ మద్యం తాగలేక నానా అవస్థలు పడుతున్నామంటూ మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొత్త మద్యం పాలసీని అమలు చేయడంతోపాటు ప్రస్తుత డిస్టరీల నుంచి నాసి రకం మద్యం సరఫరా కా కుండా చూడాలిని మద్యం ప్రియులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదేశాల మేరకే..

కొత్త మద్యం పాలసీ అమలుపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళతాం. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో మద్యం అమ్మకాలకు టెండర్లు లేదా లాటరీ తీసి టెండర్లు ఖరారు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రస్తుతం గతంలో సరఫరా చేసిన మద్యం బ్రాండ్లే షాపులకు సరఫరా అవుతున్నాయి. గతంతో పోలిస్తే మద్యం ప్రియులు అడిగిన బ్రాండ్స్ అన్నింటినీ ప్రస్తుతం ఇస్తున్నాం. ఎప్పటి నుంచి కొత్త బ్రాండ్లు అందుబాటులోకి వస్తాయన్న విషయం తెలియాల్సి ఉంది.

- మధుసూదన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనంతపురం

బాలికల ఫుట్‌బాల్ అకాడమీ ఏర్పాటుకు కృషి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ● జాతీయ పోటీల్లో ఏపీ జట్టు శుభారంభం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3: జిల్లాలో బాలికల ఫుట్‌బాల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీలు శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభమయ్యాయి. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌తో కలసి కలెక్టర్ వినోద్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలు నిర్వహణకు ఆర్డీటీ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉన్నాయన్నారు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు జగరడం సంతోషదాయకమన్నారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. మాంఛో ఫెర్రర్ మాట్లాడుతూ క్రీడాకారులు, క్రీడల అభివృద్ధికి ఆర్డీటీ ముందుంటుందన్నారు. జిల్లాలో ఉన్న క్రీడావసతులు, వనరులను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన పోటీలో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రప్రదేశ్ విజయం సాధించి శుభారంభాన్ని అందుకుంది. మరో మ్యాచ్‌లో బీహార్ జట్టుపై జార్ఖండ్ విజయం సాధించింది. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డేనియల్ ప్రదీప్, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డైరెక్టర్ రావూరి రాజేష్, జిల్లా కార్యదర్శి కూడేరు మల్లేష్, రాజా, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్

పెట్టుబడి లేకుండా రైతులకు దిగుబడి

నాగజెముడు-బ్రహ్మ జెముడు పంటసాగుకు జిల్లా అనుకూలం

రాష్ట్ర వాటర్‌షెడ్ జాయింట్ కమిషనర్ శశిధర్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/గుత్తి రూరల్, ఆగస్టు 3: పెట్టుబడి లేకుండా రైతులకు అధిక దిగుబడి, లాభదాయకమైన పంటలను సాగుచేసేలా అవగాహన కల్పిస్తామని రాష్ట్ర వాటర్‌షెడ్ జాయింట్ కమిషనర్ శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన జిల్లాకు వచ్చారు. డ్వామా పీడీ కార్యాలయంలో ఏపీడీ సుధాకర్‌రెడ్డితో కలిసి అధికారులతో మాట్లాడారు. అనంతరం గుత్తిమండలం ఊటకల్లులో రైతు వెంకటేశ్వర‌రెడ్డి సాగు చేసిన బ్రహ్మజెముడు-నాగజెముడు పంటను పరిశీలించారు. అక్కడ నుంచి శింగనమల మండలం వెస్ట్‌నరసాపురంలో పర్యటించి పంటల సాగుపై తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పాడి పశువుల దాణాకు, పశువులతో సంబంధం లేకుండా కృత్రిమంగా లెదర్ తయారీ, బయోగ్యాస్, మెడిసిన్స్‌కు నాగజెముడు-బ్రహ్మజెముడు ఉపయోగపడతాయన్నారు. ఈ పంట సాగుకు జిల్లా అనువైనదన్నారు. ఈ పంట సాగుచేసే రైతులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో పంట సాగు పద్ధతులు, మార్కెటింగ్ సౌకర్యాలపై అధ్యయనం చేయడానికే జిల్లాకు రావడం జరిగిందన్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నంలో ఇది భాగమని వివరించారు.



బ్రహ్మ జెముడు-నాగ జెముడు పంటను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి

కనుల పండువగా ఏడు శనివారాల వ్రతం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 3: ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా శనివారం నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను కనులపండువగా నిర్వహించారు. ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయం, రామ్‌నగర్ వెంకటేశ్వర ఆలయం, అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, వేణుగోపాల్ సద్గురు సాయినాథ మందిరాల్లో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు. ఆయా ఆలయాల కార్యవర్గాలు, భక్తులు పాల్గొన్నారు.



ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో వ్రత విశిష్టతను వివరిస్తున్న పండితులు




రామ్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు, పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు



వేణుగోపాల్‌నగర్ సాయినాథమందిరంలో పూజలందుకుంటున్న స్వామివార్లు

గ్రామీణాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

● కలెక్టర్ వినోద్‌కుమార్



డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3: గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల పాత్ర కీలకమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసిన అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్‌డీఏ-వెలుగు పరిధిలో అమలవుతున్న పథకాలు, మండల స్థాయి, గ్రామస్థాయిలో ఉద్యోగుల పనితీరు, ప్రగతిపై నిత్యం పరిశీలించాలని ఆదేశించారు. అన్ని విభాగాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టి కృషి చేయాలన్నారు. కార్యాలయానికి ఐఎస్ఓ-9001:2015 సర్టిఫికెట్ పొంది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, ఉన్నతస్థాయి ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం అభ్యుదయభవన్ పరిశీలించి, త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబుళమ్మ, ఏపీడీ ఈశ్వరయ్య, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు జీవనభృతి కల్పించాలి

● ఆర్థికశాఖ మంత్రికి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వినతి



మంత్రి కేశవ్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 3: ఏపీఎస్ ఆర్టీసీలో 35 సంవత్సరాలు సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు జీవనభృతి కల్పించి ఆదుకోవాలని ఆ సంఘం ప్రచార కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా కడపలో నిర్వహించిన సభకు హాజరైన ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి విశ్రాంత ఉద్యోగుల జీవనభృతికి సంబంధించి విన్నవించగా, తప్పక పరిశీలించి న్యాయం చేస్తామని ఆ సభద్వారా ఆయన హామీ ఇచ్చారన్నారు. హామీని అమలు చేస్తూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు నెలకు రూ.7,500 చొప్పున జీవనభృతి కల్పించి ఆదుకోవాలని కోరారు. సంఘం నాయకులు సీసీఎం రెడ్డి, రఘుపతి, చిన్నపరెడ్డి, కేఎల్ఎన్ ప్రసాద్, డీఎస్ఎన్ రెడ్డి, ఓబులపతి పాల్గొన్నారు.

గ్రీన్ అనంతగా నిలుపుకుందాం



క్రేన్ సాయంతో చెట్టును వేరే ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 3: అనంతపురం నగరాన్ని గ్రీన్ అనంతగా నిలుపుకుందామని గ్రీన్ ఆర్మీ వ్యవస్థాపకుడు అనంతపురం అనిల్ కుమార్ అన్నారు. శనివారం కోర్టురోడ్డులోని పోలీస్ పెట్రోల్ బంకు వద్ద తొలగిస్తున్న వేపచెట్టుతోపాటు మరో రెండు ప్రాంతాల్లో తొలగిస్తున్న చెట్లను యంత్రాల సాయంతో నడిమివంకలో నాటించారు. అదేవిధంగా ప్రజలకు వెయ్యి మొక్కలను పంపిణీ చేశారు.

భరత నాట్యం వర్క్‌షాప్



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 3: భరత నాట్యం శిక్షణపై ఎస్కే యూ కేంద్రీయ విద్యాలయంలో శనివారం వర్క్‌షాపును నిర్వహించారు. కళాకారిణి ఆత్మనాథన్ విద్యార్థులకు నాట్యంలోని భంగిమలు, ముద్రలు, ముఖకవళికలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మా ర్కండేయులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి వారసత్వాన్ని ప్రోత్సహించేలా ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లింగనిర్ధారిత వీర్యాన్ని వినియోగించుకోండి

రామగిరి, ఆగస్టు 3: పెయ్యదూడలను మాత్రమే ఇవ్వగలిగే లింగనిర్ధారిత వీర్యాన్ని వినియోగించుకోవాలని పశుసంవర్ధక జిల్లా కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ పీవీ సుధాకర్ సూచించారు. శనివారం మండలంలోని శేషంపల్లిలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పశువైద్యాధికారులు మాట్లాడుతూ 90శాతం కచ్చితత్వంతో పెయ్యదూడల పుట్టుకను ఉద్దేశించి లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసే పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. రూ.1350 విలువైన రెండు సూదులకు సబ్సిడీ పోను రూ.500 రైతులు చెల్లించాలన్నారు. ఒకవేళ సూదులు వేసిన కట్టకపోతే రూ.500 వెనక్కి ఇస్తారని, పొరపాటున కుర్రదూడ పుడితే రూ.250 వెనక్కి ఇస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 52 పశువులకు పైగా గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు సుభదాసు, సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, రామగిరి పశువైద్యులు మౌలాలిబాషా పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు అమోఘం: వీసీ



ఇన్‌చార్జి వీసీని సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 3: వర్సిటీ, విద్యార్థుల అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమించిన విశ్రాంత ఉద్యోగుల సేవలు అమోఘమని ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనిత అన్నారు. శనివారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించిన వీసీ పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు వెంకటరమణమూర్తి, లక్ష్మీపతి, మనోహర్, చిన్నపరెడ్డి, వెంకటరెడ్డి, అప్పారావు, ప్రేమచంద్ బాబు పాల్గొన్నారు

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

రామగిరి, ఆగస్టు 3: తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి రక్ష అని సీడీపీఓ కవితమ్మ అన్నారు. శనివారం మండలంలోని రామగిరి, ఆర్ కొత్తపల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, మహిళలతో కార్యక్రమాన్ని నిర్వహించి పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాగించాలన్నారు. దీనివల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగాభవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నార్పల: తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని హెల్త్‌అసిస్టెంట్ మునిరెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం నార్పల, ఉయ్యాలకుంట-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తాపించాలన్నారు. ఏఎన్ఎం పవిత్రమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ శ్రీదేవి, భారతి, ఆశా వర్కర్లు మంజుల, రమణమ్మ, వెంకటలక్ష్మి, తస్లీమ్ పాల్గొన్నారు.

ఆలయంలో దోపిడీపై విచారణ చేయించండి

● ఎమ్మెల్యేకు నసనకోట పంచాయతీ ప్రజల వినతి



ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతిపత్రం ఇస్తున్న నసనకోట పంచాయతీ ప్రజలు

రామగిరి, ఆగస్టు 3: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నసనకోట ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో గత ఐదేళ్లలో జరిగిన దోపిడీపై విచారణ చేయించాలని ఆ గ్రామ పంచాయతీ ప్రజలు డిమాండ్‌చేశారు. దీనిపై వారు శనివారం వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాలసునీతకు వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా ఇక్కడ జరుగుతున్న అక్రమాల గురించి వివరించారు. 2019కి ముందు ఇక్కడ ఆలయ కమిటీ ఉండేదని ఆలయానికి వచ్చే ఆదాయంలో భక్తుల సౌకర్యం కోసం భవన నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. అలాగే పాఠశాలలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకిరాగానే అప్పటి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకెళ్లారన్నారు. అక్కడ తమకు అనుకూలంగా ఉన్న కురుబ ముత్యాలును చైర్మన్‌ను చేసుకుని ఈఓగా నరసయ్యను నిర్మించుకున్నారన్నారు.. పూజారులుగా ముత్యాలప్ప, ఎద్దుల అప్పయ్య, లక్ష్మీనారాయణ, పరంధామ వారి కుమారులతో ఇష్టారాజ్యంగా దోచుకున్నారన్నారు. దాదాపు రూ.5 కోట్లకుపైగా అవినీతి జరిగి ఉంటుందన్నారు. వీటిపై సమగ్ర విచారణ చేసి మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, చైర్మన్‌గా ఉన్నన కురుబ ముత్యాలు, బీసీ ముత్యాలు, ఈఓ నరసయ్యతోపాటు అక్కడి పూజారులు, వారి కుమారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వారు విజ్ఞప్తిచేశారు. దీనిపై పరిటాలసునీత స్పందిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమగ్ర విచారణ చేయించి అమ్మవారిసొమ్ము ఎవరు తిన్నా కక్కిస్తామని హామీ ఇచ్చారు.

పాల రైతులకు న్యాయం చేయండి

● కలెక్టర్‌ను కోరిన సీపీఐ నేతలు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సీపీఐ నాయకులు, పాల ఉత్పత్తిదారులు

అనంతపురం టౌన్, ఆగస్టు 3: అమూల్ పాల రైతులకు న్యాయం చేయాలని సీపీఐ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున డిమాండ్ చేసారు. శనివారం పాల రైతులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లికార్జున మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో వంద మహిళా సంఘాలు ఏర్పాటు చేసి అమూల్ సంస్థకు పాలు సేకరించి ఇస్తున్నారన్నారు. ఈనెల 10 నుంచి పాలసేకరణ నిలుపుదల చేస్తున్నట్లు అమూల్ సంస్థ నిర్వాహకులు చెప్పారన్నారు. జిల్లాలో 16 వేల లీటర్లు సేకరిస్తున్నారని, ఒక్కో సంఘం రూ.2లక్షలు ఖర్చుపెట్టి యంత్రాలు తెచ్చుకున్నాయన్నారు. ఉన్నపళంగా అమూల్ పాలసేకరణ ఆపితే వారిపరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే సేకరించిన పాలకు బకాయి బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. పాడి రైతులను ఆదుకోవాలని కలెక్టరును కోరామన్నారు. రైతుసంఘం నాయకుడు రామక్రిష్ణ, పాలసేకరణ సొసైటీ సభ్యులు నాగరాజు, మాధవి, శ్రీధర్‌రెడ్డి, శివలింగ, కళావతి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్గీకరణతో సమాన అవకాశాలు: ఎమ్మెల్యే

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 3: రిజర్వేషన్ వర్గీకరణతో ఆయా వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు లభిస్తాయని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శనివారం ఎస్కేయూలో ఎస్సీ వర్గీకరణ వేడుకలు నిర్వహించారు. ఎంఈఎఫ్ కోశాధికారి బంగి సంజీవప్ప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు ఎమ్మెల్యేతోపాటు రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేక్‌కను కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ మందక్రిష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎంఈఎఫ్ నాయకులు డాక్టర్ శ్రీరాములు, దేవరాజు, నారాయణప్ప, ఆనందరాజు, వెంకటరాముడు, గోవిందు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3: ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని సమసమాజ స్థాపనకు పాటుపడాలని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. రామకృష్ణమఠం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని యువజాగృతి ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పీడీ మాట్లాడుతూ స్వామి వివేకానంద వాక్కులు భవిష్యత్తు తరాలకు బంగారుబాటలు వేస్తాయన్నారు. జాతీయ యువ అవార్డు గ్రహీత బిసాటి భరత్, రామకృష్ణమఠం అర్చనానంద మహారాజ్, వ్యవస్థాపకులు శ్రీధర్‌మూర్తి, సభ్యులు ప్రవీణ్‌వేద్రాద్రి, ప్రిన్సిపాల్ ప్రసాద్, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

పోలీసులను సత్కరించిన ఆస్పత్రి వైద్యాధికారులు

అనంతపురం టౌన్, ఆగస్టు 3: వారం క్రితం జిల్లా ఆస్పత్రి బాలింతల వార్డులో ఆడశిశువును అపహరించిన కేసులో పోలీసులు మూడుగంటలలోనే కేసు ఛేదించిన విషయం తెలిసిందే. దీంతో ఆస్పత్రి వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి వైద్యాధికారులు కేసు ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీ విజయప్రతాప్, సీఐలు క్రాంతికుమార్, ప్రతాప్‌రెడ్డి, అవుట్ పోస్టు ఏఎస్ఐ త్రిలోక్‌నాథ్ ఇతర పోలీసులను శనివారం ఆస్పత్రికి ఆహ్వానించి సత్కరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టీసీ వరుణ్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 3: జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఎస్పీ మురళీకృష్ణను కలిశారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో మురళీకృష్ణను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇండ్ల కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య ఉన్నారు.

అవకతవకలకు తావులేకుండా రేషన్ పంపిణీ

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 3: ప్రభుత్వ చౌకధాన్యపు డిపోలలో రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి అన్నారు. చెన్నేకొత్తపల్లిలోని ఎస్సీ కాలనీలో శనివారం నూతనంగా ప్రభుత్వ చౌకధాన్యపు డిపోను ప్రారంభించారు. లబ్ధిదారులకు ఆయన రేషన్ పంపిణీచేశారు. మాజీ ఎంపీపీ అంకె అమరేంద్ర, ఏపీ శ్రీనివాసులు, అమరేంద్రరెడ్డి, నక్కా నాగరాజు, వెంకటరాముడు, షరీఫ్, అశ్వత్థరెడ్డి, శివారెడ్డి, ఉత్తరకుమార్‌రెడ్డి, ఓబిరెడ్డి, సావిత్రి, చిన్నముత్యాల్‌రెడ్డి, మారుతి, ఓబుళేశు, ఆంజనేయులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని సంఘాలతో క్రీడాకారులకు నష్టం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3: గుర్తింపు లేని క్రీడా సంఘాలు తాడిపత్రిలో నిర్వహిస్తున్న తైక్వాండో పోటీలు క్రీడాకారులకు తీవ్రనష్టం కలిగిస్తాయని జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంఘం నాయకులు ఒక ప్రకటనలో హెచ్చరించారు. అమాయక తల్లిదండ్రులు, క్రీడాకారుల జీవితాలతో చెలగాటమాడుతున్న గుర్తింపు లేనితైక్వాండో క్రీడా పోటీలు, కోచింగ్ సెంటర్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, శాంతరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్ ఉన్నారు.

విద్యాసంస్థల్లో ఖాళీలు భర్తీ చేయాలి


● జీపుజాతా ముగింపులో ఏఐఎస్ఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న జాన్సన్‌బాబు

అనంతపురం విద్య, ఆగస్టు 3: జూనియర్ కళాశాలలు, హాస్టళ్లు, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజులు జీపుజాతా శనివారం ఆత్మకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ముగించారు. కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి జీపుజాతా నిర్వహించామన్నారు. హాస్టళ్లకు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు చెల్లించాలన్నారు. ఆత్మకూరులో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్‌కు వెంటనే నూతన భవనం నిర్మించాలని కోరారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద 6వ తేదీ ధర్నా చేయనున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సమితి సభ్యులు సాయి స్వరూప, జిల్లా నాయకులు రాధాజ్యోతి, కోశాధికారి హనుమంతు, నరసింహ యాదవ్, వెంకట్ నాయక్, వంశీ, వినోద్, సీపీఐ రామకృష్ణ, మంజునాథ్, సమీర్, ఆనంద్, తారక్ పాల్గొన్నారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి



అనంతపురం కల్చరల్, ఆగస్టు 3: ఆషాఢమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీమాత మూలవిరాట్‌ను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. మహామంగళ హారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు ఎమ్మెల్యే దగ్గుపాటి



అలిపిరి మెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 3: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం కాలినడకన తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా అలిపిరి మెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పలువురు టీడీపీ నాయకులతో కలిసి కాలినడకన స్వామివారి దర్శనం కోసం వెళ్లారు. ఎమ్మెల్యే వెంట అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, నాయకులు గాజుల ఆదెన్న, రాయల్ మురళీ, కూచి హరి, గుర్రం నాగభూషణం, లక్ష్మీనరసింహ, రమేష్, మార్కెట్ శ్రీధర్, పోతుల లక్ష్మీనరసింహులు, జోగి రాజేంద్ర ఉన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

రాప్తాడు, ఆగస్టు 3: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును టీడీపీ రాప్తాడు మండల నాయకులు మాజీ మండల కన్వీనర్ యర్రగుంట నారాయణస్వామి, మరూరు గోపాల్ కలిశారు. శనివారం విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరారు.

భర్తపై అనుమానంతో భార్య ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఆగస్టు 3: భర్తపై ఉన్న అనుమానంతో ఓ మహిళ క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది. 11నెలల చిన్నారని పక్కన పడుకోపెట్టి ఫ్యాన్‌కు ఉరివేసుకుని తనువు చాలించింది. నగరంలోని సాయినగర్ రెండో క్రాస్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు సాయినగర్ రెండో క్రాస్‌లో పవన్‌కుమార్, మేఘన(20) దంపతులు నివాసముంటున్నారు. పవన్‌కుమార్ నగరంలోని మెడిక్యూర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. మేఘనకు భర్తపై ఇతర మహిళలతో సంబంధాలున్నాయనే విషయంలో అనుమానముండేది. ఫోన్ వచ్చినా అనుమానాలు వ్యక్తం చేసేది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో భార్యను తల్లితో మాట్లాడించాడు. కొంతసేపటికి డ్యూటీకి వెళ్లాడు. రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటి డోర్ కొడితే తీయలేదు. 11 నెలల చిన్నారి ఏడుపు వినిపించింది. చుట్టుపక్కల వారిని పిలిపించి తలుపుపగలకొట్టారు. అప్పటికే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరికి వేలాడుతున్న మేఘన కనిపించింది. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్(కనగానపల్లి) ఆగస్టు 3: మండలంలోని చంద్రాచెర్ల గ్రామానికి చెందిన గంగాదేవి అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు తెలిపిన మేరకు గంగాదేవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేదని, పలు ఆసుపత్రులలో చికిత్సలు చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో మనస్తాపం చెంది పొలానికి వెళ్లి అక్కడ ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. స్థానికులు గమనించి హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రామగిరి, ఆగస్టు 3: మండలంలోని ఎంసీపల్లి పంచాయతీకార్యదర్శి నాగభూషణ ఫిర్యాదుపై రామగిరి పోలీసులు శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం గ్రామంలో కార్యదర్శి పింఛన్‌లు పంపిణీ చేస్తుండగా మంగాపురానికి చెందిన రాజశేఖర్, వైసీపీ నాయకులు నరసింహారెడ్డి, నరిసిరెడ్డి తదితరులు అతని విధులకు ఆటంకం కల్గించడమేకాకుండా కులం పేరుతో దూషించారు. దీంతో కార్యదర్శి ఫిర్యాదు మేరకు రామగిరి పోలీసులు వైసీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదుతోపాటు ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కల్గించడంపై కూడా కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 3: అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎస్పీ కేవీ మురళీకృష్ణ సానుభూతి వ్యక్తం చేశారు. శ్రీనివాసులు 1990లో జిల్లా పోలీసు ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరాడు. 2010లో సివిల్ విభాగానికి కన్వర్షన్ అయ్యారు. హెడ్‌కానిస్టేబుల్‌గా అనంతపురం త్రీటౌన్‌లో పనిచేస్తున్నారు. స్థానిక జేఎన్‌టీయూ రోడ్డులోని హిందూ శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ మునిరాజ, త్రీటౌన్ సీఐ ధరణికిషోర్, ఎస్ఐ గోపాలుడు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసుల నాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బండారు శ్రావణిశ్రీ జన్మదినం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 3: ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదినాన్ని కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో శనివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, పొడరాళ్ల రవీంద్రా, ఓబులపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి, అనంతరం కేక్‌కట్ చేసి తినిపించుకునారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తెలుగుయువత నాయకుడు కిరణ్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. మల్లికార్జునరెడ్డి, జొన్నారామయ్య, సుధాకర్, పెద్దప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్యే: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికైతే తిరుమల కొండకు కాలినడిక ద్వారా స్వామిని దర్శించుకుంటానని ఎన్నికలు ముందు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మొక్కుకున్నారు. శనివారం జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కుటుంబ సభ్యులుతో కలిసి అలిపిరి మెట్ల ద్వారా కాలినడికన స్వామివారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు.



కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

గార్లదిన్నె: శాసన సభ్యురాలు బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలు శనివారం టీడీపీ నాయకులు నిర్వహించారు. కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మాజీ జడ్పీటీసీ గుర్రం ఆదినారాయణ, రమణప్ప, ఓబిరెడ్డి, చల్లానాగరాజు, గుత్తాహరి, శీనప్ప, విశ్వనాథ్, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీకేఎస్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



గార్లదిన్నెలో...



శింగనమలలో...



పెరవలిలో...

శాకంబరిగా చౌడేశ్వరీదేవి


శాకంబరి అలంకరణలో చౌడేశ్వరీదేవి

ఉరవకొండ, ఆగస్టు3: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో వెలసిన చౌడేశ్వరీదేవి శనివారం శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు చౌడేశ్వరీ జయంత్యుత్సవాలు

పట్టణంలోని చౌడేశ్వరి, ఉరగాద్రిచౌడేశ్వరీ దేవి, పురమాన కట్ట చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ఆదివారం అమ్మవారి జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయకమిటీల సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తికి సామూహిక క్షీరాభిషేకం, బోనాల సమర్పణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త గట్టు శ్రీరాములు శనివారం తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిమాలు కృష్ణమూర్తి, తొగట వీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు మద్దిలేటి ప్రభాకర్‌తో కలిసి ఆయన శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన అనంతరం ఒడిబియ్యం కట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం తొగట వీరక్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చేతులు మీదుగా అందించనున్నట్లు తెలిపారు. సాయంత్రం అమ్మవారి పల్లకి సేవ ఉంటుందని, భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఉత్సవ విగ్రహానికి వెండి బహూకరణ

కణేకల్లు, ఆగస్టు 3: మండల కేంద్రంలోని కన్యక పరమేశ్వరి ఆలయంలో నూతనంగా తయారు చేయబోతున్న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి భూశెట్టి ఫ్యామిలీ వెండిని బహూకరించారు. మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణగుప్త, గీతశ్రీ, నాగరాజు, రాజేశ్వరి దంపతులు కిలో వెండిని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్త, సతీష్ గుప్త, శ్రీధర్, మంజుశెట్టి, సుబ్రహ్మణ్యం, వీరేష్ పాల్గొన్నారు.

వర్షం కోసం విరాటపర్వం పఠనం

యాడికి, ఆగస్టు3: వర్షం కోసం ప్రార్థిస్తూ శనివారం యాడికిలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో విరాటపర్వం పఠించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కోడూరుకు చెందిన రవీంద్రశర్మ విరాటపర్వాన్ని చదివారు. ఈ ఏ డాది ఖరీఫ్‌లో వర్షాలు సరిగా కురవక చాలామంది పంటలు సాగుచేయలేదు. సాగు చేసిన పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయి. విరాటపర్వం చదివితే వర్షాలు కురుస్తాయనే నమ్మకమని గ్రామపెద్దలు తెలిపారు. అర్చకులు హరికృష్ణశర్మ, రైతులు శేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటశివ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చౌకధాన్యపు డిపోల తనిఖీ

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 3 : మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ చౌకధాన్యపు డిపోలను ఆర్డీఓ రాణి సుష్మిత శనివారం తనిఖీ చేశారు. ఒంటిమిద్ది, గూబనపల్లి గ్రామాల్లో చౌక డిపోలను సందర్శించి రైతులకు స్వయంగా రేషన్ బియ్యం అందించారు. రికార్డులను, కొలతలను పరిశీలిం చారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

పంట నమోదు చేసుకోండి : ఏఓ

పుట్లూరు, ఆగస్టు3: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కాత్యాయిని శనివారం తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లాలన్నారు. సాగుచేసిన ప్రతి ఎకరాకు నమోదుచేసుకోవాలన్నారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

యాడికి, ఆగస్టు3: మండలకేంద్రలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు విశాలాక్షి ఖాదీసేవా సంస్థ అధ్యక్షుడు నారాయణస్వామి తెలిపారు. విశాలాక్షి ఖాదీసేవా సంస్థ, కిమ్స్ సవేరా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండె సంబంధిత రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హోటళ్లలో పరిశుభ్రతను పాటించాలి

జిల్లా ఆహార తనిఖీ అధికారి తస్లీమ్

గుంతకల్లుటౌన్, ఆగస్టు3: హోటళ్లలో తప్పనిసరిగా పరిశుభ్రతను పాటించాలని జిల్లా ఆహార తనిఖీ అధికారి తస్లీమ్ పేర్కొన్నారు. పట్టణంలోని పల్లవి, పవిత్ర హోటల్, ఇడ్లీ బండ్లను శనివారం సాయంత్రం ఆమె తనిఖీ చేశారు. హోటళ్లలో ఆహార పదార్థాలను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. అయోడిన్ ఉప్పును వాడాలన్నా రు. వంటచేసేట ప్పుడు క్యాప్, మాస్కులు ధరించాలన్నారు. పల్లవిపవిత్ర హోటళ్ల లైసెన్స్ రెన్యు వల్ చేసుకోనందుకు నోటీసులు అందజేసినట్లు ఆమె తెలిపారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తి మృతి


వన్నూరుస్వామి(ఫైల్)

విడపనకల్లు, ఆగస్టు 3: మండలంలోని గడేకల్లు గ్రామంలో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో స్తంభంపై నుంచి పడి మృతి చెందాడు. మండలపరిధిలోని మాళాపురం గ్రామా నికి చెందిన వన్నూరుస్వామి(35) గడేకల్లులోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. అతడు శనివారం సాయంత్రం విద్యుత్ స్తంభం పైకి ఎక్కి వైర్ల మరమ్మ తులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అదుపు తప్పి పై నుంచి కిందకు పడిపో యాడు. అతడి తలకు బలమైన గాయమైంది. వెంటనే గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఆదెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విడపనకల్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

ఉరవకొండ, ఆగస్టు3: వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గ్రామంలో శనివారం సరస్వతి(36)అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సరస్వతి భర్త నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలను చదివించుకుంటోంది. పిల్లల చదువుకు, భర్త ఆసుపత్రి ఖర్చుల కోసం రూ.10లక్ష దాకా అప్పులు చేసింది. అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు శనివారం ఉదయం తెల్లవారుజామున గుర్తించారు. అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గమనించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి, ఆగస్టు3: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో శనివారం ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కిందపడి శ్రీరాములు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దవడుగూరు మండలం మిడుతూరుకు చెందిన శ్రీరాములు గుత్తినుంచి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా అనంతపురం రోడ్డులోని సీపీఐ కాలనీ వద్ద ప్రమాదశాత్తు కిందపడాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కసాపురంలో తిరుమంజన స్నపనం


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 3: పునర్వసు తిరునక్షత్రం సందర్భంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సీతారామచంద్రస్వామి వార్లకు తిరుమంజన స్నపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి.. తిరుమంజన స్నపనం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

నెట్టికంటి సన్నిధిలో గుత్తి ఆరో అదనపు న్యాయాధికారి

కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని శనివారం గుత్తి ఆరో అదనపు న్యాయాధికారి ఎం శ్రీహరి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు న్యాయాధికారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రదిక్షణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శనానికి వెళ్తున్న న్యాయాధికారి శ్రీహరి

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం: ఐసీడీఎస్ పీడీ


ఉరవకొండలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహిస్తున్న పీడీ శ్రీదేవి

ఉరవకొండ, ఆగస్టు3: తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ.. పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాల ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం నుంచి టవర్ క్లాక్ వరకూ ర్యాలీ చేపట్టి కవితా హోటల్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణపోషణ లభిస్తుందని సీడీపీఓ ఢిల్లీశ్వరి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని చెట్నేపల్లి లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగే శ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, విజయలత, సుజాత, తదితరులుపాల్గొన్నారు.

కళ్యాణదుర్గం(శెట్టూరు) : తల్లిపాల వారోత్సవాలను మండల పరిధిలోని బసంపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం నిర్వహించారు. ముందుగా వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు టీడీపీ స్థానిక నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి, అనంతరం తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దేవి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని టీడీపీ నాయకుడు సోమనాథ్‌గౌడ్ అన్నారు. మండలంలోని గోవిందవాడ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. డబ్బాపాలు బిడ్డకు ఇవ్వరాదని తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా పంపిణీ చేయాలి : ఆర్డీఓ

గుంతకల్లుటౌన్, ఆగస్టు3: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు తప్పని సరిగా పౌష్టికాహారం అందజేయాలని ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని హను మేష్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

జేసీపీఆర్ ప్రశ్నలకు భారీ స్పందన

తాడిపత్రి, ఆగస్టు3: రెండురోజులక్రితం టీడీపీ మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోషల్‌మీడియా వేదికగా వేసిన నాలుగు ప్రశ్నలు యావత్తు ప్రజానీకాన్ని ఆలోచింపజేస్తోంది. ఆయన రెండురోజులక్రితం సోషల్‌మీడియా ద్వారా ప్రజలకు నాలుగు ప్రశ్నలను వేశారు. మీ ఊరు ఏ ఊరు? మీ ఊరి అభివృద్ధి గురించి ఎప్పుడైనా ఆలోచించారా? మీ ఊరికి ఏమి చేశారు ? అభివృద్ధికి డబ్బులు అవసరమా ? అనే ప్రశ్నలు వేశారు. వీటికి ముఖ్యంగా యువత నుంచి అధిక సంఖ్యలో స్పందన లభించింది. ఈ సందర్భంగా శనివారం ఆయన మరోసారి సోషల్‌మీడియా వేదికగా నాలుగు ప్రశ్నలకు వచ్చిన సమాధానాలను ప్రజలకు వివరించారు. తనకు సమాధానాలు ఇచ్చిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు.

సీఎంను కలిసిన లీగల్ సెల్ రాష్ట్రకార్యదర్శి


ముఖ్యమంత్రి చంద్రబాబుతో బీఎస్ కృష్ణారెడ్డి

గుంతకల్లుటౌన్, ఆగస్టు3: టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో భేటీ అయ్యారు. గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధి కోసం, సార్వత్రిక ఎన్నికల్లో గుమ్మనూరు జయరాం విజయం కోసం కృషి చేశానని ముఖ్యమంత్రికి వివరించినట్లు ఆయన తెలిపారు. లీగల్ సమస్యలను పరిష్కరించడానికి ముందు ఉండాలని చంద్రబాబు సూచించారని తెలిపారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి పదవి ఉంటుందని తెలిపారన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్, జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్‌ని మర్యాదపూర్వకంగా కలిసినట్లు కృష్ణారెడ్డి తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం

రాయదుర్గం సివిల్ కోర్టు న్యాయాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి రమ్య

రాయదుర్గంరూరల్, ఆగస్టు 3 : రాజీ మార్గమే రాజమార్గమని, గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు చిన్న చిన్న గొడవలకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని స్థానిక సివిల్‌కోర్టు న్యాయాధికారి రమ్య పేర్కొన్నారు. మండలంలోని మల్లాపురం తండాలో శనివారం రాయదుర్గం న్యాయ సలహా సేవ మండలి ఆధ్వర్యంలో మండల న్యాయ సేవాసదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా న్యాయాధికారి రమ్య పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే న్యాయసేవ మండలి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లోకానంద, డిప్యూటీ తహసీల్దార్ రఘు, ఈఓపీఆర్డీ రంగనాయకులు, పంచాయతీ కార్యదర్శి హేమంత్ రాజ్, వీఆర్వో కిరణ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న న్యాయాధికారి

రాయదుర్గంరూరల్ : మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామిని శనివారం రాయదుర్గం సివిల్ కోర్టు న్యాయాధికారి రమ్య దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనతరం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు న్యాయాదికారి శాలువతో సన్మానించారు. అనంతరం ఆలయ విశిష్టత, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రఘు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

117 జీఓను రద్దు చేయాలి : ఎస్టీయూ

కుందుర్పి, ఆగస్టు 3 : ప్రభుత్వ విద్యావ్యవస్థ గాడిన పడాలంటే వెంటనే 117 జీఓను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలో ఎస్టీయూ నాయకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... 117 జీఓతో దాదాపు ఐదు లక్షలమందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని అన్నారు. విద్యావ్యవస్థ గాడిన పడాలంటే వెంటనే 117 జీఓను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే సీపీఎస్ రద్దు చేసి పీఆర్సీ ప్రకటించాలని, ఏపీఎల్ఐ, పీఎఫ్, ఈఎల్ఎస్ బకాయిలు చెల్లించాలని అన్నారు. బదిలీలు , ఉద్యోగోన్నతులను వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రేవన్న, జిల్లా కార్యదర్శులు చెనరాయప్ప, రాధాకృష్ణరాజు, జిల్లా కన్వీనర్ హనుమంతప్ప, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసిన దృశ్యం

బ్రహ్మసముద్రం, ఆగస్టు 3 : మండలంలోని పిల్లలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విలువైన స్టడీ మెటీరియల్‌ను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. పదో తరగతిలో మంచి ఉత్తీర్ణతకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం సభ్యులు రమేష్ చౌదరి, నరసింహులు, నరసింహారెడ్డి, మధు, మనోహర్ తదితరులు, పాఠశాల హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూజీ నీట్ రాష్ట్రస్థాయిలో యాడికి విద్యార్థికి ఐదో ర్యాంక్


సాయి జశ్వంత్‌రెడ్డి

యాడికి, ఆగస్టు3: యూజీ నీట్‌లో యాడికి విద్యార్థి ముమ్మడి సాయి జశ్వంత్ రెడ్డి రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంక్ సాధించాడు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రానికి సంబంధించి యూజీ నీట్ ర్యాంక్‌లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. విజయవాడ ఆరోగ్య విశ్వవిద్యాలయం ర్యాంక్‌ల జాబితాను శనివారం విడుదల చేసింది. రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో ముమ్మడి సాయి జశ్వంత్ రెడ్డి 720మార్కులకు గాను 710 మార్కులు సాధించి ఐదో ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ముమ్మడి సాయి జశ్వంత్‌రెడ్డి తండ్రి కొండారెడ్డి ప్రైవేట్ వైద్యుడిగా, తల్లి మహితా కిరణ్ వ్యవసాయాధికారిగా పనిచేస్తున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : తహసీల్దార్

పామిడి, ఆగస్టు 3 : భూమి సమస్యలపై వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి మండల రెవెన్యూ అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నూతన తహసీల్దార్‌గా శ్రీధర్‌మూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.

వినాయక ఉత్సవ కమిటీ ఎంపిక

తాడిపత్రి, ఆగస్టు3: పట్టణంలోని గాంధీకట్ట వద్ద నిర్వహించే వినాయక ఉత్సవాల కేంద్ర కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగం రెడ్డి అంకాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శింగరి లక్ష్మీనారాయణ, మధుసూదన్‌గుప్త, గంగాధర్‌యాదవ్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.వేడుకలను సెప్టెంబరు 7 నుంచి ఐదు రోజులు నిర్వహిస్తామన్నారు.

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ నాయకులు


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయస్వామి

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 3 : ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్ల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ చేపట్టిన జీపు జాతా కార్యక్రమాన్ని మూడోరోజు శనివారం పట్టణంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించా లంటూ ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు భారీ స్థాయిలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, అడ్వకేట్ సంజీవప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయస్వామి, జిల్లా కోశాధికారి హనుమంతరాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, ప్రకాష్, సిద్దు, సురేష్, అజయ్, హర్షవర్దన్, మధు, రఘు, సేవా మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

పోక్సోకేసులో వ్యక్తి అరెస్ట్

రాయదుర్గం రూరల్, ఆగస్టు 3: మండలంలోని టీ వీరాపురానికి చెందిన మధుకుమార్ అనే వ్యక్తిని పోక్సోకేసులో అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఓ బాలికను ప్రేమించి మోసం చేసిన కేసులో అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కిడ్నాప్ కేసులో యువకుడు...

గుమ్మఘట్ట మండలం బేలోడు గ్రామానికి చెందిన ఎర్రిస్వామి అనే యువకుడిని ఓ విద్యార్థి కిడ్నాప్ కేసులో అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. మండలానికి చెందిన ఓ విద్యార్థిని కిడ్నాప్ చేసిన సంఘటనలో విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడైన యువకుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు.

వైభవంగా పెన్నోబులేశుడి పల్లకి సేవ


ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు3: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరే గించారు. ఆషాఢ మాసం చివరి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం పల్లకిసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు బంగి శంకర్ తెలిపారు. స్వామివారికి ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగించారు.

తగ్గిన నేమకల్లు ఆలయ ఆదాయం

బొమ్మనహాళ్, ఆగస్టు 3 : మండలంలోని ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం తగ్గింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఈఓ నరసింహారెడ్డి సమక్షంలో శనివారం హుండీ కానుకలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు లెక్కించారు. ఈ ఏడాది హుండీ ఆదాయం రూ. 15,37,990 వచ్చినట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. గతేడాది రూ. 16,27,208 రాగా ఈ ఏడాది రూ. 89,218 తగ్గినట్లు ఈఓ తెలిపారు. అలాగే 21 అమెరికా కరెన్సీ డాలర్లు వచ్చాయని, వాటి విలువ రూ. 1759 ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ధర్మకర్త వన్నూరుస్వామి, టీడీపీ నాయకులు గాలి బసప్ప, చంద్రప్ప, అన్నదాన కమిటీ ఛైర్మన్ తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

బెళుగుప్ప, ఆగస్టు 3 : మండలంలోని ఉపాధి హామీ పథకం కింద నిధులు నిర్వహిస్తున్న 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా చేసినట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. మండలంలో 19 మంది ఉండగా తగ్గుపర్తి, ఆవులెన్న ఫీల్డ్ అసిస్టెంట్లు యథావిధిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. దుద్దేకుంట, గంగవరం సిబ్బంది రాజీనామా చేయలేదు. జీడిపల్లి, యలగలవంక తండాలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జూన్ 4వ తేదీ నుంచి నిరంతరాయంగా విధులకు 13 మంది హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలుపుతూ రాజీనామా పత్రాలను అధికారులకు అం దజేశారు. ఈ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీడీఓ తెలిపారు.

మోదీ, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం


కార్యక్రమంలో పాల్గొన్న మహిళా మోర్చా, బీజేపీ, టీడీపీ నాయకులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు3: ఎస్సీవర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో శనివారం స్థానిక మోదీనాబాదులోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు చిన్నకళావతి, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ఎమ్మార్పీఎస్ నాయకుడు నరసింహులు, టీడీపీ నాయకుడు చికెన్ జగన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, నాయకులు గుర్రం సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, సావిత్రమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

'యాదవులు ఐక్యమత్యంగా ఎదగాలి'

రాయదుర్గంరూరల్, ఆగస్టు 3 : యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే ఐక్యమత్యంతో ముందుకు వెళ్లాలని యాదవసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బంగి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని ఆవులదట్ల గ్రామంలో శనివారం యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... త్వరలో జరుగబోయే శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను నియోజకవర్గంలో వాడవాడలా పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. రాయదుర్గం మండలం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆంజనేయులు, రామకృష్ణ, కృష్ణమూర్తి, నాగప్ప, అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా సర్పంచ్‌లు వన్నూరుస్వామి, మల్లేశప్ప, ప్రధాన కార్యదర్శులుగా బొజ్జప్ప, ఆంజనేయులు, కార్యదర్శులుగా మధు, తిమ్మారెడ్డి, రామన్నను ఎన్నుకున్నారు. అలాగే జాయింట్ సెక్రెటరీలుగా రమేష్, శ్రీపతి, గోవిందు, ప్రచార కార్యదర్శులుగా ఈరన్న, తిప్పేర, రాజు, ట్రెజరర్‌గా వంశీ, వీరభద్ర, శ్రీనివాసులుతో పాటు మరికొంతమందిని కమి టీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు వైద్యులు రామస్వామి, ప్రచార కార్యదర్శి ఆవుల మనోహర్, బంగి రమేష్, సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామిలు, మండల యాదవ సోదరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

తాడిపత్రి, ఆగస్టు3: పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాలులో శనివారం రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీజేవైఎం రాష్ట్ర నాయకులు హరీశ్‌రెడ్డి, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్‌రావు, టీడీపీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున హాజరయ్యారు. పోటీల్లో అన్ని జిల్లాల నుంచి మొత్తం 400మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆర్గనైజర్ సాయి తెలిపారు. సబ్ జూనియర్ క్యాడెట్ విభాగంలో బాలురు, బాలికలు పాల్గొన్నారు. గెలుపొందిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలు ఆదివారం కొనసాగుతాయని తెలిపారు.